క్లుప్తంగా

ముగిసిన బెంచ్‌ప్రెస్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని అంబేడ్కర్‌భవన్‌లో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా స్థాయి బెంచ్‌ప్రెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. తొలుత ఉదయం జరిగిన ప్రారంభ పోటీల కార్యక్రమాన్ని కార్పొరేటర్ కమర్తపు మురళి, టూటౌన్ సీఐ కుమారస్వామిలు ప్రారంభించారు. అనంతరం జూనియర్, సీనియర్ కేటగిరిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.మనోజ్ చౌదరీ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష తులసీ దళార్చన


లక్ష తులసీ దళార్చనలో పాల్గొన్న అర్చకులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష తులసీ దళార్చన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పూజారి ముడుంబ రామానుజచార్యులు, గ్రామ పెద్దలు గెల్లా మహేశ్, అక్కినేని నాగేశ్వరరావు, నూతక్కి ప్రసాద్, కొత్తా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుమాధారం చెరువును నీటితో నింపాలి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువును నీటితో నింపాలని ఆయకట్టు ప్రాంతం రైతులు సోషల్ మీడియా ద్వారా జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదివారం కోరారు. చెరువుమాధారం–మంగాపురంతండా గ్రామాల మధ్య ఉన్న చెరువు నీరు ఇటీవల అంతా వృథాగా పోవడంతో చెరువుమాధారం, మంగాపురంతండా, నాచేపల్లి, రాయగూడెం, బైరవునిపల్లి గ్రామాల చెరువు ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా అధికారులు స్పందించి వెంటనే చెరువును నింపాలని కోరారు.

చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించాలి


మాట్లాడుతున్న చలమల హైమావతి

ఖమ్మంరూరల్: రాజ్యాంగ పరంగా న్యాయ వ్యవస్థలో చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించడానికి తమ సంస్థ కృషి చేస్తుందని మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి జాతీయ చైర్‌పర్సన్ డాక్టర్ చలమల హైమావతి అన్నారు. ఆదివారం మండలంలోని సాయిగణేశ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మానవ హక్కుల పరిరక్షణ ప్రజా సమితి జిల్లా కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ నిబంధనలకు లోబడి తమ సంస్థ పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు బండి వెంకట్, వైస్ చైర్‌పర్సన్ భాగ్య, అంజమ్మ, ధరణి, పి.వెంకటేశ్వర్లు, రాజు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: గట్టయ్య సెంటర్‌లో నివాసముంటున్న తమ ఇంటిపై అధికార పార్టీకి చెందిన కొందరు దాడి చేశారని షేక్ సమీరా ఆరోపించారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుకు చెందిన ఇంట్లో తాము ఉంటుండగా.. అధికార పార్టీకి చెందిన కొందరు తన భర్త అబ్బాస్ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న సమయాన దాడి చేసి వస్తువులన్నీ బయట పడేశారని తెలిపారు. ఈవిషయమై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రషీద్, మహబూబీ, అబ్దుల్‌పాషా, నాగూర్, ఇమామ్ పాషా, జమాల్‌బీ, అతిమా, రసూల్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	హాయ్‌నాన్న
సాయిరాం	డెవిల్
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	బబుల్‌గమ్

– ఖమ్మంగాంధీచౌక్

నగరంలోని ముస్తాఫనగర్ శ్రీరామనగర్ కాలనీలో ఓచోట వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



ప్లాస్టిక్ భూతం..!

ముప్పు పొంచి ఉన్నా నిషేధంపై నిర్లక్ష్యం

- ఇబ్బడిముబ్బడిగా వాడుతున్న ప్రజానీకం
- పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం
- అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: ప్లాస్టిక్.. ప్లాస్టిక్.. ప్లాస్టిక్ ఇది మన జీవితాలలో ప్రధాన భాగమైంది ఎంతలా అంటే మనం బజార్‌కు వెళ్తే ప్లాస్టిక్ కవర్ లేకుండా ఎటువంటి వస్తువును ఇంటికి తీసుకురాలేనంత. పూర్వకాలంలో గుడ్డసంచులను వాడేవారు కానీ నేటి ఆధునిక సమాజంలో ప్లాస్టిక్ వాడకం అనేది ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. ఈ ప్లాస్టిక్ విపరీతమైన వాడకం వలన వాతావరణ కాలుష్యం మరింతగా పెరిగిపోయి మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారడంతో పాటు జంతుజాతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. నగరంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.

చర్యలు శూన్యం..

ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం బాగా పెరిగింది. కిరాణం మొదలుకుని ఏ షాపుకు వెళ్లినా ప్లాస్టిక్ కవర్లలో కొన్న వస్తువులు ఇస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని కట్టడి చేయాలని కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు ఉన్నా.. ఆ దిశగా వారు చర్యలు తీసుకోవడం లేదు. నగరంలో ఉన్న వైన్స్ షాపులు మొదలుకుని ఏ షాపు యజమానులైనా సాయంత్రం వరకు వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను రాత్రి సమయాన కాల్చుతుండడం పరిపాటిగా మారింది. గతంలో మాదిరిగా ఖమ్మంలో ప్లాస్టిక్ వాడకం బాగా పెరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్లాస్టిక్ ప్రమాదకరం..



ప్లాస్టిక్ వాడడం మంచిది కాదు. ప్లాస్టిక్ భూమిలో కరగాలంటే చాలా ఏళ్లు పడుతుండగా.. ఆలోపే భూమికి చేయాల్సిన నష్టం చేసేస్తుంది. పాలు, టీ, కూరలు, ఇతర వేడి పదార్థాలు కవర్లలో తెచ్చి తినడం, తాగడం చేయకూడదు. అలా చేస్తే కేన్సర్‌లాంటివి వచ్చే ప్రమాదం ఉంటుంది. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను, జనపనార క్లాత్ సంచులను వాడుకోవాలి.

– డాక్టర్ అనుమోలు అప్పారావు, ఎండీ జనరల్ మెడిసిన్, డీఎం న్యూరాలజీ

ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలు..

- ప్లాస్టిక్ సంచుల వలన పర్యావరణానికి అనేక రకాలుగా ముప్పు వాటిల్లుతుంది. ప్లాస్టిక్ సంచులను బయటపడేయడం వలన అవి మురుగుకాల్వలలోకి వెళ్ళి అవి మూసుకుపోవడం వలన ఆ ప్రాంతాలలో అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది.
- నిల్వ ఉండడం వలన దోమలు, ఈగలు లాంటి అనేకరకాల వ్యాధికారక సూక్ష్మజీవులు వృద్ధి చెంది ప్రాణాంతకమైన వ్యాధులను కలుగజేస్తాయి. ఇవి భూమిలోకి ప్రవించి మట్టి లోపలి పొను సైతం కలుషితం చేస్తాయి.
- ప్లాస్టిక్ కవర్లలో వ్యర్థాలను పడేయడం వలన అవి జంతువులు తినడంతో వాటికి హానికరమైన ప్రభావాలు కలుగుతాయి.
- ప్లాస్టిక్‌ను వినియోగించిన తర్వాత చాలా మంది ప్లాస్టిక్ వ్యర్థాలను ఒక కుప్పగా వేసి కాల్చి చేతులు దులుపుకుంటున్నారు కానీ దాని వలన పర్యావరణంలోకి విషపూరితమైన రసాయనాలను విడుదల చేస్తాయని తెలుసుకోరు.

ప్రత్యామ్నాయంగా..

- ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జనపనార (జూట్) లేదా గుడ్డ సంచులను వినియోగించాలి.
- ప్రతి ఒక్కరూ ఏదైనా వస్తువులను తేవడానికి బయటకు వెళ్తున్నప్పుడు కచ్చితంగా గుడ్డసంచులను తీసుకువెళ్లాలి. దీనివలన ప్లాస్టిక్ సంచుల వాడకం తగ్గుతుంది.
- చికెన్, మటన్ షాపులకు వెళ్లేముందు స్టీల్ బాక్సులను తీసుకెళ్లాలి. తద్వారా చికెన్ గానీ, మటన్ గానీ కలుషితం కాకుండా ఉంటాయి.


నూతన బస్టాండ్ వెనుక ప్రాంతంలో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు


భట్టిని సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు


ఖమ్మంఅర్బన్: భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న అకౌంట్స్ విభాగం ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంగాంధీచౌక్/నేలకొండపల్లి/ఖమ్మంఅర్బన్: జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం పలు సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించి అభినందనలు తెలిపారు. భట్టిని కలిసిన వారిలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు, కళా సారధి డాక్టర్ నాగబత్తిని రవి, కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోయిన వేణు, తెలంగాణ డివిషనల్ అకౌంట్స్ ఆఫీసర్స్(డీఏఓస్) సంఘం జిల్లా అధ్యక్షుడు జె.పుష్పరాజ్, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, రాష్ట్ర నాయకులు వేల్పుల శ్రీనివాస్, వి.నవీన్, ఎన్.రవీంద్ర, ఎస్.శంకర్, సాంబశివ రెడ్డి, నాగరాజు, రాధాకృష్ణ, శంకరాచార్యులు, మహేశ్‌కుమార్, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా భట్టి భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

నేడు కాకినాడకు భట్టి..

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేడు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు వెళ్లనున్నారు. సోమవారం సాయంత్రం 5.15 గంటలకు విమానంలో బయలుదేరి 6.35 గంటలకు రాజమండ్రి చేరుకుంటారు. అనంతరం కాకినాడకు చేరుకుని ఓ ఫంక్షన్ హాల్‌లో ఐఆర్‌ఎస్ అధికారి మద్దుకూరి వెంకట సుబ్బయ్య చౌదరి కుమార్తె రిసెప్షన్‌లో పాల్గొంటారు. రాత్రి అక్కడే బసచేసి మంగళవారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి 7.45 గంటలకు రాజమండ్రి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని 8.50 గంటలకు విమానంలో బయలుదేరి 10.05 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

ఘనంగా గ్రామీణ వైద్యుల 24వ వార్షికోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కామేపల్లి: తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం కామేపల్లి మండల 24వ వార్షికోత్సవాన్ని కొత్తలింగాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, తదిపరి వైద్య పరీక్షలు, చికిత్సలకు దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లే విధంగా చొరవచూపాలన్నారు. గ్రామీణ వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, వసతి గృహాలు కేటాయించాలని ఆయన కోరారు. అనంతరం సంఘం 2024 క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బందెల నాగేశ్వరరావు, డి.రాము, లేతాకుల బహబూబ్‌రెడ్డి, ఆర్.అప్పారావు, ప్రచార కార్యదర్శి జి.రమేష్, సీహెచ్.కృష్ణదాస్, సుందర్‌రావు, బాబూరావు, రాధాకృష్ణ, కొండల్, నాగశంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు గెలుపు, ఓటములు సహజం


మాట్లాడుతున్న కే.వీ.రెడ్డి

నేలకొండపల్లి: కమ్యూనిస్టులకు గెలుపు, ఓటములు సహజమని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన గంగాధర్‌రావు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో గెలిచినా, ఓడిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. గంగాధర్ రావు ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థలలో ఎన్నికలలో మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలకుల వైఫల్యాల గురించి క్షేత్ర స్థాయిలో ఆందోళనలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, మండల నాయకులు కట్టికోల వెంకటేశ్వర్లు, పి.నాగేశ్వరరావు, సిరికొండ ఉమామహేశ్వరీ, మార్తి కొండలరావు, శ్రీదేవి, కే.వీ.చారీ, వల్లూరిపల్లి లక్ష్మీనారాయణ, మల్లిఖార్జున్‌రావు, బొడ్డు బాబు, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'అయోధ్య' అక్షింతలు


ఖమ్మంలో అక్షింతలను అందిస్తున్న శ్రీ లక్ష్మీ బాలాజీ సేవా సమితి సభ్యులు


కూసుమంచిలో అక్షింతలు అందజేస్తున్న దేవాలయ కమిటీ బాధ్యులు

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మంగాంధీచౌక్/కూసుమంచి: అయోధ్యలోని రామమందిరంలో సీతారామచంద్రుల ప్రతిష్ఠ, అంకురార్పణ సందర్భంగా వేసిన అక్షింతలను శ్రీరామతీర్థ క్షేత్ర ట్రస్ట్ ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా నగరంలోని 25, 26 డివిజన్లతోపాటు కూసుమంచి గ్రామంలోని ఇంటింటికీ తిరిగి అక్షింతలను పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలోని మరో ప్రాంతంలో శ్రీలక్ష్మీ బాలాజీ సేవా సమితి మహిళలు అక్షింతలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్, వడ్డే లక్ష్మీ, బండారు శ్రీనివాసరావు, పాపని నాగ, ఆకుల మురళి, గోజే శ్రీనివాసరావు, కోటి శ్రీను, రవికుమార్, నర్సింహారావు, సర్వేశ్వరరావు, రాజు, నాగేశ్వరారవు, మహేంద్ర శ్రీనివాసరావు, మారుతి విశాలి, లక్ష్మీపార్వతి, రజిని, అనంతకుమారి, ఉదయ్‌కుమార్, శేష ఫణికుమార్‌శర్మ, సతీశ్‌శర్మ, రాము, ఖాదర్, నాగమణి, మారుతి, భార్గవి, పెరిక బాలాజీ, నేరళ్ల శ్రీనివాస్, గడ్డం వెంకటేశ్వర్లు, చెన్నా మోహన్, శివ రామయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన 'ఆరెం'

కామేపల్లి: వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కెప్టెన్ బంజర మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల నాయకుడు ఆరెం రవి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రవి చెప్పారు.

నూతన కమిటీ ఎన్నిక


వి.వెంకటేశ్, టి.లక్ష్మణ్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.లక్ష్మణ్, వి.వెంకటేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఆజాద్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షులుగా జి.దీపిక, ఎ.కిరణ్, సహాయ కార్యదర్శులుగా నవీన్, శేశి, కోశాధికారిగా తరుణ్‌తో పాటు మరో 9 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తామన్నారు. ఖమ్మం జిల్లా యూనివర్సిటీ సాధన కోసం సకల జనులను ఐక్యం చేసి ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జీడీఎస్ నేతలు


కేంద్ర మంత్రితో డాక్ సేవక్ ప్రతినిధులు


ఖమ్మంగాంధీచౌక్: ఉద్యోగాల నుంచి తొలగించబడిన గ్రామీణ డాక్ సేవక్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ.. గ్రామీణ డాక్ సేవక్ తెలంగాణ సర్కిల్ ప్రతినిధులు కేంద్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని అభ్యర్థించారు. తెలంగాణ సర్కిల్ గ్రామీణ డాక్ సేవక్ ప్రతినిధి వర్గం ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యను వివరించారు. డిసెంబర్ 12 నుంచి దేశవ్యాప్తంగా గ్రామీణ డాక్ సేవక్‌లు సమ్మె చేశారని, డిసెంబర్ 15న సర్వీస్ తక్కువగా ఉన్న, మూడేళ్ల లోపు సర్వీస్ ఉన్న వారు మొత్తం 1,200 మంది తెలంగాణ సర్కిల్‌లోనే ఉన్నారని, వారిని తిరిగి ఉద్యోగాల్లో చేర్చాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. గ్రామీణ డాక్ సేవక్ తెలంగాణ సర్కిల్ ప్రతినిధులు సీహెచ్.కోటేశ్వరరావు, బండి జయరాజు, ఖమ్మం డివిజన్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ముదిరాజ్‌ల అభినందన సభ


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రఘునాథపాలెం: ముదిరాజ్‌లు ఐక్యమత్యంగా ఉండి రాజకీయంగా, విద్యాపరంగా ఒకరికొకరు తోడ్పాటునందించుకుంటూ ముందుకు సాగాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పతనపు వెంకటేశ్వర్లు, కొప్పెర వెంకటనర్సయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొప్పెర జానికిరాములు, నర్ల శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పువ్వాడ నగర్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన తెలంగాణ గ్రామ ముదిరాజ్ కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ ఉదయనగర్ కమిటీ అధ్యక్షుడు మేకల యేసు, ఉపాధ్యక్షుడు కాశబోయిన బాబు, గౌరవ సలహాదారులు చిక్కుల మల్లయ్య, సురబోయిన వీరన్న, కోశాధికారి పందుల ప్రసాద్, జిల్లా ముదిరాజ్ ఉద్యోగ సంఘాల కన్వీనర్ ములకలపల్లి సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో వైద్యశిబిరం విజయవంతం


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యాన, ఆర్క ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీఎస్‌ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్డీ (వరంగల్) బుగ్గవీటి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడగా.. వైద్యులు విద్యార్థులకు పలు పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ధరావత్ కీమానాయక్, ఉపాధ్యక్షుడు నరేష్‌కుమార్, కార్యదర్శి దామోదర్‌రావు, సహాయ కార్యదర్శి కోక్యానాయక్, కోశాధికారులు అబ్బులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 6వ డివిజన్‌లో గల ఓ ఫంక్షన్ హాల్‌లో కామేపల్లి మండలం కొమ్మినేపల్లి హైస్కూల్‌లో చదివిన పదో తరగతి(1990–91 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగాక వ్యక్తిగత విషయాలు పంచుకుని ఆటపాటలతో సందడిగా గడిపారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కన్నన్ బాబు, శంకరయ్య, రాజారావు, సీతాకుమారి, చంద్రశేఖర్‌లకు శాలువతో ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడతామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటాచారి, ముత్తయ్య, శ్రీనివాస్, భిక్షమయ్య, రామారావు, రవి, జానీ, సత్యనారాయణ, సీతారాములు, మురళీకృష్ణ, అన్నపూర్ణ, సామ్రాజ్యం, రజిని, అనిత, మాధవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రామదాసు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ప్రగతి శీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మొదటి మహాసభలు ఈ నెల 28న వనపర్తిలో జరగనున్నాయని, ఈ సభలను జయప్రదం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్లపూడి అప్పారావు, పగిడికత్తుల రామదాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మహాసభల్లో కార్మిక వర్గాల సమస్యలపై చర్చించబడుతున్నందున గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో జీపీ కార్మికులు సమ్మె చేసిన కాలంలో వేతనాలు నిలిపివేయడం సిగ్గుచేటని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ సమ్మె కాలపు వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, సంఘ జిల్లా నాయకులు మేగడ సైదులు, కత్తుల భిక్షం, అక్బర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం డిపో గ్యారేజ్‌లో వనభోజనాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం డిపో గ్యారేజ్‌లో ఆర్టీసీ ఉద్యోగులకు ఆదివారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఖమ్మం డీఎం బి.శ్రీనివాస్ బహుమతులు అందజేశాక ఆర్టీసీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీని లాభాల బాటలో నడపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఖమ్మం డిపో సీఐ రామిశెట్టి రామయ్య, మెకానికల్ సిబ్బంది, వెల్ఫేర్ బోర్డు మెంబర్ శ్రీనివాసరావు, సంజీవరావు, చావా రమేష్, బీఎస్‌రెడ్డి, ప్రదీప్, బస్టాండ్ ఎస్ఎం శ్రీనివాసరావు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ, లౌకిక విద్యావిధానానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: శాస్త్రీయ, లౌకిక విద్యా విధానం అమలు జరిగినప్పుడే సమాజం మారి అందరికీ సమాన అవకాశాలు వస్తాయని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.అశోక్‌కుమార్, పి.నాగిరెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం టీపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫెడరేషన్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, కామన్ స్కూల్ విధానం, శాస్త్రీయ విద్యా విధానం, సమాజ నిర్మాణమే ధ్యేయంగా తమ సంఘం పని చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగం పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ బడ్జెట్ కేటాయింపుల్లో నానాటికి తగ్గించడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.ఇదిలా ఉండగా.. ఖమ్మంలో వచ్చే నెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్న సంఘం రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహాసభల ఆహ్వానం సంఘం బాధ్యులు వి.మనోహర్‌రాజు, ఎస్.వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, ఎస్.విజయ్ పాల్గొన్నారు.